ఉగాది నాటికి జగనన్న ఇళ్లు పూర్తి చేయాలి

కైకలూరు: జగనన్న గృహ లబ్ధిదారుల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు సూచించారు. జగనన్న లే అవుట్ల పురోగతిని తన క్యాంప్ కార్యాలయంలో ఎంఎల్‌ఎ శనివారం సమీక్షించారు. పూడికకు మట్టి అవసరమైన ప్రాంతాల్లో అంచనాలు రూపొందించి, పనులు చేపట్టాలన్నారు. భూమి అవసరమైన గ్రామాల్లో తక్షణం కొనుగోలుకు ప్రతిపాదనలు తయారు చేయాలని సూచించారు. ఉగాది నాటికి ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యాలను చేరుకోవాలన్నారు. ముఖ్యంగా తరుగుమాల, లోకుమూడి లే అవుట్ల పూడికపై అధికారులు దృష్టి పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో గృహనిర్మాణ శాఖ డిఇఇ రమణమూర్తి, కైకలూరు, మండవల్లి, కలిదిండి, ముదినేపల్లి తహశీల్దార్లు మురళీకృష్ణ, జనార్ధనరావు, తేజమణి, మండవల్లి ఎంపిడిఒ మల్లేశ్వరి, హౌసింగ్ ఎఇలు శేఖర్, శేషగిరి, ఇఒపిఆర్‌డి శ్రావణ్ కుమార్, ఆర్‌ఐ ప్రసాద్, వర్క్ ఇన్‌స్పెక్టర్ విజయ్ పాల్గొన్నారు.

ఆధునికీకరణ తూచ్..!

ఏ ఒక్క పనికీ కానరాని ప్రభుత్వ అనుమతులు
ఊసే లేని టెండర్ల ప్రక్రియ
రూ.900 కోట్లు విలువైన పనులున్నా నిధులు సున్నా
డెల్టా ఆధునికీకరణపై ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం
ప్రతియేటా రైతుల కష్టాలు వర్ణనాతీతం

పంటకాలువలో భారీగా పెరిగిన తూడు (ఫైల్)

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

డెల్టా ఆధునికీకరణ పనులు ఈ ఏడాది లేనట్టేనని తేలిపోయింది. ఏప్రిల్ నెలాఖరుకు కాలువ కట్టేసి పనులు ప్రారంభించాల్సి ఉన్నప్పటికీ ఇప్పటి వరకూ ప్రభుత్వం నుంచి ఏఒక్క పనికీ అనుమతి రాని పరిస్థితి నెలకొంది. ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి పనులకు సిద్ధం కావాల్సిన యంత్రాగం ప్రభుత్వం నుంచి అనుమతి రాకపోవడంతో టెండర్ల ఊసే లేకుండాపోయింది. వైసిపి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక డెల్టా ఆధునికీకరణను పూర్తిగా పక్కన పెట్టేసింది. దీంతో ఖరీఫ్‌లో వరద నీరు కిందకు పారక, రబీలో సాగునీరు అందక రైతులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతంగా మారుతున్నాయి. ఉభయగోదావరి జిల్లాల డెల్టా ప్రాంతంలో దాదాపు 4.60 లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేస్తున్నారు. 11 ప్రధాన కాలువలు, 300కు పైగా ఉప కాలువల ద్వారా డెల్టాకు సాగునీరు సరఫరా సాగుతోంది. 2007లో డెల్టా ఆధునికీకరణ పనులకు సంబంధించి 1464.44 కోట్లకు ప్రభుత్వం ఆమోద ముద్ర వేసింది. దశాబ్దన్నర కాలం గడిచినా ఆధునికీకరణ పనులు పూర్తి కాలేదు. ఇంకా రూ.900కోట్లకు పైగా విలువ చేసే ఆధునికీరణ పనులు జరగాల్సి ఉంది. గత ప్రభుత్వాల హయాంలో ప్రతియేటా ఎంతోకొంత పనులు జరిగేవి. వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత పూర్తిగా ఆధునికీకరణ పనులు పడకేశాయి. కాలువలపై బ్రిటీష్ కాలం నాటి కట్టడాలతోనే ఇప్పటికీ నెట్టుకొస్తున్నారు. కెనాల్ లైనింగ్, స్ట్రక్చర్ రిపేరింగ్ వంటి పనులు ఎప్పటి నుంచో పెండింగ్‌లోనే ఉన్నాయి. పూడికతో నిండిన కాలువలను పూర్తిస్థాయిలో తవ్వాల్సి ఉంది. గడిచిన మూడున్నరేళ్లలో ఏఒక్క పనీ జరగని దుస్థితి నెలకొంది. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ప్రతియేటా అన్నదాతకు కష్టాలే

డెల్టా ఆధునికీకరణ పనులు జరగకపోవడంతో ఉమ్మడి జిల్లాలోని రైతులు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. కాలువలు పూడికతో నిండటంతో చిన్నపాటి వర్షానికే పొలాల్లో నీరు నిలిచిపోతుంది. ఖరీఫ్‌లో నారుమడుల దశలోనే రైతులు నష్టాలు చవిచూస్తున్నారు. వరదల సమయంలో ఇక పంట పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. కాలువలు పూడిపోవడంతో నీరు కిందకు పారక పొలాల్లో రోజులు తరబడి వరద నీరు నిల్వ ఉండిపోతుంది. దీంతో పంటంతా కుళ్లిపోయి దెబ్బతింటుంది. ప్రతియేటా పంటలు దెబ్బతినడం ప్రభుత్వం అరకొరగా నష్టపరిహారం ఇచ్చి చేతులు దులుపుకోవడం సర్వసాధారణమైంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో కౌలురైతులే 75 శాతం సాగు చేస్తున్నారు. ప్రభుత్వం ఇస్తున్న పరిహారం సైతం కౌలురైతులకు అందడం లేదు. ఆధునికీకరణ పనులు జరిగి ఉంటే పొలాల్లో నీరు త్వరితగతిన తగ్గి పంట దెబ్బతినే పరిస్థితి ఉండదు. ప్రతియేటా లక్షల ఎకరాల్లో పంట దెబ్బతింటున్నా ప్రభుత్వానికి మాత్రం ఆధునికీకరణ గురించి పట్టడం లేదు. ఇక రబీ సాగుకు వచ్చేసరికి సాగునీరు అందక రైతుల పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. ప్రస్తుత రబీలో కొనసాగుతున్న పరిస్థితే అందుకు నిదర్శనం. గోదావరి జలాలు పూర్తిగా అడుగంటిపోవడంతో సీలేరు జలాలపైనే రబీ సాగు నడుస్తోంది. కాలువ పరిధిలో ఆయకట్టుకు ఐదు రోజుల చొప్పున వంతులవారీ విధానం అమలవుతోంది. కాలువలు మెరకదేరిపోవడంతో నీరు కిందకు పారక వంతులవారీ విధానంలో పొలాలకు సాగునీరు అందడం లేదు. దీంతో రైతులు ఆయిల్ ఇంజిన్లతో పంటను కాపాడుకోవాల్సి దుస్థితి నెలకొంది. దీనంతటికీ ప్రధాన కారణం ఆధునికీకరణ పనులు జరగకపోవడమే. తమ్మిలేరుకు సంబంధించి ఆధునికీకరణ పనులు చేసిన కాంట్రాక్టర్‌కు చెల్లింపులు చేయకపోవడంతో చిన్నచిన్న పనులు చేసేందుకు సైతం కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని తెలుస్తోంది. ఆధునికీకరణ పనులపై ప్రభుత్వం ప్రదర్శిస్తున్న నిర్లక్ష్యంపై రైతుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది.

జెడ్‌పి పీఠం.. ఉంగుటూరుకేనా..!

బిసి మహిళకు అవకాశంపై సరత్రా చర్చ

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఉమ్మడి జిల్లా పరిషత్ ఛైర్మన్ పీఠంపై సర్వత్రా చర్చ జరుగుతోంది. జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్‌కు ఎంఎల్‌సి టిక్కెట్ దక్కింది. ఆయన నామినేషన్ దాఖలు చేయడంతో ఈ స్థానానికి ఖాళీ ఏర్పడనుంది. జెడ్‌పి ఛైర్మన్ పదవి బిసి రిజర్వుడు అయింది. ఉమ్మడి జిల్లాలో 48 జెడ్‌పిటిసి స్థానాలున్నాయి. యలమంచిలి స్థానం నుంచి జెడ్‌పి ఛైర్మన్‌గా కవురు శ్రీనివాస్ ఇప్పటి వరకూ ప్రాతినిథ్యం వహించారు. ఉంగుటూరు, భీమడోలు, భీమవరం, కాళ్ల, మొగల్తూరు, నరసాపురం, పాలకోడేరు, పెదపాడు, ఉండి జెడ్‌పిటిసి సభ్యులుగా బిసిలే పదవిలో ఉన్నారు. వాటిలో నలుగురు పురుషులు కాగా మిగతా ఐదు చోట్ల మహిళలే. ఈసారి జెడ్‌పి ఛైర్మన్ పదవి మహిళకు కేటాయించేందుకు అధిష్టానం మొగ్గుచూపనుందనే నమ్మకం ఆశావాహుల్లో కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో బిసి సామాజిక తరగతికి చెందిన చెందిన ఉంగుటూరు జెడ్‌పిటిసి సభ్యురాలు కొరిపల్లి జయలక్ష్మి, పెదపాడు జెడ్‌పిటిసి సభ్యులు గంటా పద్మశ్రీ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. అయితే ఉంగుటూరు జెడ్‌పిటిసి సభ్యురాలు జయలక్ష్మి బిఎస్‌సి చదివి ఆమె భర్త కొరిపల్లి శ్రీనివాస్ ప్రోత్సాహంతో రాజకీయాల్లోకి వచ్చారు. 2009 సెప్టెంబరు 11 నుంచి 2011 జూలై 21 వరకూ ఉంగుటూరు ఎంపిపిగా సేవలందించారు. ఆమె అత్త కొరిపల్లి అప్పలనరసమ్మ ఇండిపెండెంట్‌గా కైకరం నుంచి 1996లో ఎంపిటిసిగా గెలుపొందారు. 2019 స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉంగుటూరు జెడ్‌పిటిసిగా కొరిపల్లి జయలక్ష్మి విజయం సాధించారు. రాజకీయ కుటుంబ నేపథ్యం, విద్యావంతురాలు, సామాజిక తరగతి కూడా కలిసిరావడంతో ఈసారి ఛైర్మన్ పదవికోసం నేతలు పావులు కదుపుతున్నారు. ఉంగుటూరు శాసన సభ్యులు పుప్పాల వాసుబాబు కూడా జయలక్ష్మి అభ్యర్థిత్వాన్ని అధిష్ఠానం వద్దకు తీసుకెళ్లినట్లు ప్రచారం జరుగుతోంది. నియోజకవర్గంలో పార్టీకి పట్టు ఉందని, ఈ అసెంబ్లీ సీటు గెలుపొందిన పార్టీయే అధికారంలోకి వస్తుందనే బలమైన నమ్మకం అటు రాజకీయంగానూ.. ఇటు ప్రజల్లోనూ నాటుకుంది. చివరికి అధిష్ఠానం నిర్ణయం కోసం ఆ పార్టీ నాయకులు, నేతలు, కార్యకర్తలు ఆశగా ఎదురుచూస్తున్నారు. మరోవైపు మండలానికి చెందిన నాయకులు, కార్యకర్తలు జయలక్ష్మికి గ్రామాలవారీగా మద్దతు పలుకుతున్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ ప్రసన్నవెంకటేష్

నేరస్తులు భయపడాలి.. ప్రజలు మెచ్చాలి

నేర సమీక్షా సమావేశంలో కలెక్టర్ ప్రసన్నవెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

నేరస్తులు భయపడేలా.. ప్రజలు మెచ్చేలా పోలీసుల పనితీరు ఉండాలని కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ అన్నారు. 2022 - 2023 సంవత్సర వార్షిక నేర సమీక్ష సమావేశం స్థానిక జిల్లా పోలీస్ ప్రధానకార్యాలయంలో ఎస్‌పి రాహుల్‌దేవ్‌శర్మ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు.

కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ మాట్లాడుతూ నేరస్తులు భయపడేలా, ప్రజలు మెచ్చే విధంగా పోలీసు యంత్రాంగం పనిచేసి ప్రజలకు చేరువు కావాలన్నారు. లిప్రో యాక్టివ్ పోలీసింగ్, కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా గుడ్ టచ్ - బ్యాడ్ టచ్ అనే అంశాలను వివిధస్థాయి విద్యార్థినులకు అవగాహన కల్పించాలన్నారు. స్కూళ్లు, కాలేజీల విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాల గురించి అవగాహన కల్పిస్తూ విద్యాలయాలు, కాలేజీల్లో జనసంచారం లేని ప్రదేశాలను తప్పకుండా తనిఖీ చేయాలని సూచించారు. ఆ విద్యాలయాల్లో విద్యార్థులు వ్యసనాలకు అలవాటు పడకుండా ఉండేలా అవగాహన కల్పించాలని చెప్పారు. వ్యసనాలకు అలవాటు పడిన వారి వివరాలను సేకరించాలన్నారు. ఐటిడిఎ ప్రాంతాల్లోని ఏజెన్సీలో నాటుసారా నిర్మూలనకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. స్టూడెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్‌పై విద్యార్థి దశనుంచే అవగాహన కల్పించాలన్నారు. వివిధ విద్యాసంస్థల వద్ద ఈవ్‌టీజింగ్‌పై పలు కార్యక్రమాలను నిర్వహిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. స్పందనలో వస్తున్న సివిల్ కేసులను అధికారులు సమన్వయంతో పరిష్కరించాలన్నారు.

ఎస్‌పి రాహుల్‌దేవ్ శర్మ మాట్లాడుతూ జిల్లాలో రహదారి ప్రమాదాల నివారణకు, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు, గంజాయి అక్రమ రవాణా నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకున్నామన్నారు. సైబర్ నేరాల నివారణకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అధికారులు సమన్వయంతో చేపట్టిన అవేర్నెస్ ప్రోగ్రామ్‌కు దేశవ్యాప్తంగా నిర్వహించిన సర్వేలో 2022 సంవత్సరానికి సిల్వర్ స్కాచ్ అవార్డును సాధించినట్లు తెలిపారు. భీమవరంలో నిర్వహించిన బాసట కార్యక్రమంలో విదేశాల్లో ఉపాధి కోసం వెళ్లి ఇబ్బంది పడుతున్న విషయాలపై సెమీఫైనల్ స్కాచ్ అవార్డు-2022 వచ్చిందన్నారు. ప్రో యాక్టివ్ పోలీస్ అనే అంశాల్లో దేశవ్యాప్తంగా నిర్వహించిన సర్వేలలో సెమీ స్కాచ్ అవార్డు 2022 సాధించామన్నారు. ఎఫ్ఐసిసిఐ స్మార్ట్ పోలీసింగ్ అనే అంశాల్లో అవార్డును 2022 సంవత్సరానికిగాను జిల్లాకు వచ్చినట్లు, అదే స్ఫూర్తితో రానున్న కాలంలో ప్రజలకు మెరుగైన భద్రత, శాంతి భద్రతల పరిరక్షణకు సిబ్బంది సమిష్టి కృషితో సేవలు అందిస్తామని తెలిపారు. సచివాలయాల్లో గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులు తమకు కేటాయించిన ఉద్యోగ నిర్వహణ చేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నారన్నారు.

ఎస్‌సి, ఎస్‌టి కోర్టు గౌరవనీయులు సునీల్‌కుమార్ మాట్లాడుతూ న్యాయ సంబంధమైన అనేక అంశాల్లో అధికారులు అడిగిన ప్రశ్నలకు, వాటికి సందేహాలను నివృత్తి చేస్తూ భవిష్యత్‌లో వారు నిర్వహించాల్సిన పద్ధతులను వివరించారు. ఈ కార్యక్రమంలో జెసి పి.అరుణ్‌బాబు, జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్ రవీంద్ర ధర్మ, అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.



మృతిచెందిన బాలుడు

గోడకూలి ఎల్‌కెజి విద్యార్థి దుర్మరణం

ప్రజాశక్తి - నూజివీడు

ఓ ప్రయివేటు పాఠశాలలోని మరుగుదొడ్డి గోడ కూలి ఎల్‌కెజి చదువుతున్న బాలుడు ప్రాణాలు కోల్పోయాడు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. శనివారం మధ్యాహ్నం జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆగిరిపల్లి మండలం ఈదులుగూడేనికి చెందిన కందుల నీలమణికంఠ(5) నూజివీడు ఎంప్లాయీస్ కాలనీలోని విజ్‌డమ్ ప్రయివేటు పాఠశాలలో ఎల్‌కెజి చదువుతున్నాడు. మధ్యాహ్నం విరామం సమయంలో నీలమణికంఠ టాయిలెట్ కోసం మరుగుదొడ్డివైపు వెళ్లాడు. ఈ తరుణంలో ఒక్కసారిగా గోడ కూలి బాలుడిపై పడింది. ఈ ప్రమాదంలో నీలమణికంఠ అక్కడికక్కడే మృతిచెందాడు. పక్కనే ఉన్న మరో ఇద్దరు చిన్నారులు గాయాలపాలయ్యారు. బాలుడి మృతదేహాన్ని నూజివీడు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాలుడి మృతితో తల్లిదండ్రులు కన్నీమున్నీరుగా విలపిస్తున్నారు. విషయం తెలుసుకున్న నూజివీడు ఎస్‌ఐ శివనారాయణ సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు. పాఠశాల నిర్వాహకులు పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఉన్నట్లు సమాచారం. విషయం తెలుసుకున్న నూజివీడు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ముద్రబోయిన వెంకటేశ్వరరావు ప్రభుత్వాసుపత్రికి వెళ్లి బంధువులను పరామర్శించి ఓదార్చారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

నకిలీ పత్రాలతో ప్రభుత్వ, చెరువు భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ స్లీవజోజీ తెలిపారు. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. జంగారెడ్డిగూడెం మండలం, పట్టణంలో కొంతమంది ముఠాలుగా ఏర్పడి ప్రభుత్వ భూములు, చెరువులు, ప్రయివేటు భూములకు దొంగ పట్టాలతో అక్రమ రిజిస్ట్రేషన్లు చేయించుకుంటున్నారని, సెటిల్‌మెంట్ పేరుతో భూ యజమానుల నుండి లక్షలు ఆర్జిస్తున్నారని రెవెన్యూ అధికారుల దృష్టికి వచ్చినట్లు తెలిపారు. ఇలాంటి వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దెబ్బతిన్న మొక్కజొన్న పంట

నకిలీ పురుగు మందులు.. నట్టేట ముసుగుతున్న రైతులు

ప్రజాశక్తి - చింతలపూడి

నకిలీ పురుగు మందులు రైతులను నట్టేట ముంచుతున్నాయి. ఏపుగా పెరుగుతున్న పంట సైతం ఈ పురుగుమందుల దెబ్బకు నాశనమవుతుంది. 'ఇలాంటి పురుగు మందుల నివారణకు పటిష్ట చర్యలు తీసుకున్నాం. తరచూ తనిఖీలు చేస్తున్నాం..' అంటూ వ్యవసాయాధికారులు చెబుతున్న మాటలకు, క్షేత్రస్థాయిలో పనులకు పొంతన లేకుండా ఉంది. మార్కెట్‌లోకి విచ్చలవిడిగా నకిలీపురుగు మందులు వచ్చేస్తున్నాయి. వీటిని నియంత్రించాల్సిన అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. పంటలు పండించాలంటనే రైతులు సంకోచిస్తున్నారు. ఇప్పటికే పెట్టుబడి ఖర్చులు రెట్టింపు అయ్యి, మరోవైపు దళారుల దెబ్బకు మద్దతు ధర రాక నానాఅవస్థలు పడుతున్నారు. ఈ పురుగు మందులు తమకు వద్దని రైతులు చెబుతున్నప్పటికీ, మాయమాటలు చెప్పి బలవంతంగా వాటిని అంటగడుతున్నారు. చివరకు నష్టపోయిన తర్వాత రైతులను ఎవరూ కన్నెత్తి చూడటం లేదు.

ముఖ్యంగా చింతలపూడి మండలంలోని యర్రగుంటపల్లి గ్రామానికి చెందిన ముగ్గురు రైతులు యర్రగుంటపల్లిలో ఉన్న పురుగులు మందులు దుకాణం వద్ద మొక్కజొన్న పంట ఎదుగుదలకు పురుగు మందులు కొనుగోలు చేశారు. వాటిని పిచికారీ చేసిన తర్వాత మొక్కజొన్న ముచ్చుకు ఎర్రగా వచ్చి, మొక్కలు చనిపోయాయని రైతులు తెలిపారు. ముగ్గురు రైతులు మొతం 23 ఎకరాల్లో ఈ మందును పిచికారీ చేశారు. ఈ మొత్తం పంట చనిపోతుందని రైతులు అవేదన వ్యక్తం చేస్తున్నారు.

దీంతో ఎరువుల షాపు యాజమనిని రైతులు నిలదీశారు. పురుగులు మందుల కంపెనీ యజమానితో మాట్లాడి న్యాయం చేస్తామని చెప్పారు. పురుగు మందుల కంపెనికీ సంబంధించిన ప్రతినిధులు ఇటీవల పొలంలోకి వెళ్లి పరిశీలించారు. రైతుల అందరి సమక్షంలో ఎకరాకు రూ.60 వేలు ఇస్తామని, అదికూడా రెండు నెలలు తరువాత ఇస్తామని హామీ ఇచ్చినట్లు తెలిసింది. గుట్టుచప్పుడు కాకుండా కంపెనీ ప్రతినిధులు రైతులతో మాట్లాడినట్లు సమాచారం. ఉన్నతాధికారులు స్పందించి దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

శాంపిల్స్ పరీక్షల నిమిత్తం పంపాం

పంట చనిపోవడానికి గల కారణాలను తెలుసుకుంటున్నామని మండల వ్యవసాయాధికారి మీనాకుమారి తెలిపారు. ఈ మేరకు శాంపిల్స్ సేకరించి పరీక్షల నిమిత్తం గుంటూరు పరిశోధనాలయానికి పంపామని చెప్పారు.

అందాల నగరం.. అందరి బాధ్యత

ఏలూరు మున్సిపల్ కమిషనర్ వెంకటకృష్ణ

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ఏలూరు నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దడంలో ప్రతిఒక్కరూ సహకరించాలని నగర కమిషనర్ సంక్రాంతి వెంకట కృష్ణ కోరారు. శనివారం కమిషనర్ కార్యాలయంలో మీడియాతో పలుఅంశాలపై కమిషనర్ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాసుపత్రిలో జన్మించిన వారికి సంబంధించిన వివరాలను వైద్యశాఖ నమోదు చేస్తుందని, ప్రయివేటు ఆసుపత్రుల్లో జన్మించిన వారి వివరాలను తాము ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని చెప్పారు. గృహాల వద్ద జన్మించే వారి వివరాలను శానిటరీ, ఎన్విరాన్‌మెంట్ కార్యదర్శి ద్వారా నమోదు చేస్తామన్నారు. పుట్టిన 21 రోజుల్లోపు నగరంలోని 79 సచివాలయాల ద్వారా నమోదు కార్యక్రమం జరుగుతుందని కమిషనర్ చెప్పారు.

చనిపోయిన వారి మరణ ధృవీకరణ పత్రాలను కూడా 21 రోజుల్లో సచివాలయం హెల్త్ సెక్రటరీ ద్వారా తీసుకోవాలని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం నిషేధించిన ప్లాస్టిక్‌కవర్లను, సింగిల్ యూజ్ బ్యాగులు కూడా వాడకూడదని, బయోడిజిబుల్ బ్యాగులు వాడకూడదని చెప్పారు. 15 రోజులుగా దాడులు నిర్వహిస్తున్నామని, ఇప్పటి వరకు రూ.లక్ష వరకు జరిమానా విధించామన్నారు. దీనిపై ఇప్పటికే ప్రతీ కార్యదర్శికి అధికారం ఇచ్చామన్నారు. చెత్త పరిమాణాన్ని తగ్గించడం, ఆరోగ్యకర సమాజమే తన లక్ష్యమన్నారు. ఏలూరులో నెల రోజుల వ్యవధిలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిబంధనలను పక్కాగా అమలు చేస్తామన్నారు. ప్లాస్టిక్ అమ్మకాలతో పాటు, తయారీపై కూడా నిషేధాజ్ఞలు ఉన్నాయన్నారు. పట్టణంలో వాల్‌పోస్టర్లు అంటించకూడదని, ఫ్లెక్స్ ఫ్రీ నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. వాల్‌పోస్టర్లను అర్ధరాత్రి అంటిస్తున్నారని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఏలూరులోని 50 డివిజన్లలో నోడల్ అధికారులను నియమించామని, వారు అన్నిడివిజన్లలో తిరుగుతూ ప్రజలకు అందుబాటులో ఉంటారని కమిషనర్ తెలిపారు.

డెల్టాకే వరుస పదవులు.. మెట్ట సంగతేమిటో..!

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్థానిక సంస్థల ఎంఎల్‌సి నామినేషన్ల ప్రక్రియ పరిశీలన దశ దాటింది. ఉపసంహరణ ప్రక్రియ సాగుతోంది. ఏదేమైనా సోమవారం సాయంత్రం నాటికి ఎన్నికలు జరుగుతాయా లేక ఏకగ్రీవమా అనేది తేలిపోనుంది. అయితే అభ్యర్థిత్వాల ఖరారులో వైసిపి అధిష్టానం అనుసరించిన వ్యూహం, ప్రధాన ప్రతిపక్షం టిడిపి తనకేమీ పట్టనట్లు వ్యవహరించడం చర్చనీయాంశాలుగా మారాయి.

సాగునీటి సమస్యను పట్టించుకునే వారేరీ



స్థానిక సంస్థల కోటాలో పాలకొల్లు నుంచి ఒకరికి అవకాశం దక్కుతుందని మొదటి నుంచి వైసిపి నేతలు అంతా భావించారు. ఎంఎల్‌సి రేసులో మేకా శేషుబాబు, గుణ్ణం నాగబాబు ఉండటంతో నాగబాబుకే అవకాశం దక్కుతుందని అంతా ఊహించారు. అయితే అనుహ్యంగా జెడ్‌పి ఛైర్మన్, పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి కవురు శ్రీనివాస్ అభ్యర్థిత్వాన్ని అధిష్టానం ఖరారు చేయడంతో అంతా ఆశ్చర్యచకితులయ్యారు. వచ్చే ఎన్నికల్లో ఎంఎల్‌ఎ అభ్యర్థిగా ప్రచారంలో ఉన్న కవురు శ్రీనివాస్‌కు ఎంఎల్‌సిగా అవకాశం ఇవ్వడం అధిష్టానం వ్యూహమేనని తెలుస్తోంది. పాలకొల్లు నియోజకవర్గంలో కాపుల ఓటింగ్ ఎక్కువ. ఆ రీత్యా అక్కడ టిడిపి నుంచి సిట్టింగ్ ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడును ధీటుగా ఎదుర్కోవాలంటే అనివార్యంగా అదే సామాజిక తరగతికి చెందిన వారికి టిక్కెట్ ఇవ్వాలని అధినేతల ఆలోచనగా తెలుస్తోంది. ఆ రీత్యా కవురు శ్రీనివాస్‌కు ఎంఎల్‌సిగా అవకాశం ఇచ్చి ఎంఎల్‌ఎ అభ్యర్థిత్వం నుంచి పక్కన పెట్టేందుకు వ్యూహరచన చేసినట్లు తెలుస్తోంది. అదే సమయంలో నాగబాబుకు ఎంఎల్‌సిగా అవకాశం ఇస్తే మేకా శేషుబాబు ఇండిపెండెంట్‌గా రంగంలోకి దిగే సూచనలు కన్పించాయి. దీంతో మధ్యేమార్గంగా కవురును ఎంఎల్‌సిగా పంపడం ద్వారా శేషుబాబుకు తాత్కాలికంగా బ్రేక్ వేయడం, ఎంఎల్‌ఎ అభ్యర్థి రేసు నుంచి కవురును తప్పించి నాగబాబుకు అవకాశం ఇవ్వడం ఒకే దెబ్బకు రెండు పిట్టలు చందంగా అధిష్టానం వ్యవహరించిందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. అయితే రెండు ఎంఎల్‌సి పదవులు పశ్చిమగోదావరి పరిధిలోని వారికే ఇవ్వడం ఇటు ఏలూరు జిల్లాలోని నేతలను నిరాశకు గురి చేసింది. ఇప్పటికే ఏలూరు జిల్లా నుంచి మంత్రులు కాదుకదా. కనీసం రాష్ట్ర స్థాయి క్యాబినెట్ హోదా కలిగిన పదవులు కూడా లేవు. ఈ క్రమంలో కచ్చితంగా ఈసారి ఎంఎల్‌సి పదవి ఏలూరు జిల్లాకు కేటాయిస్తారని అంతా ఆశించారు. స్థానిక సంస్థల నియోజకవర్గం నుంచి అవకాశం ఇవ్వకపోయినా కనీసం ఎంఎల్‌ఎ కోటాలో ఇస్తారనుకుంటే అదీ ఇటీవల ఏలూరు జిల్లాలో విలీనమైన కొల్లేరు ప్రాంత వ్యక్తికీ, అదీ టిడిపి నుంచి వచ్చిన జయమంగళ వెంకటరమణకు పదవి కట్టబెట్టడం ఏలూరు జిల్లాలోని వైసిపి శ్రేణులను మరింత కుంగదీసింది. ఈ క్రమంలో కనీసం జెడ్‌పి ఛైర్మన్ పదవైనా ఏలూరు జిల్లా పరిధిలో వారికి కట్టబెడతారా.. లేక అదీ గతంలో మాదిరి డెల్టా ప్రాంతవాసికి కట్టబెడతారా అనే చర్చ వైసిపి శ్రేణుల్లో పెద్దఎత్తున సాగుతోంది.

నేతలంతా ఎంఎల్‌సి ఎన్నికల హడావుడిలో ఉంటే రైతులు సాగునీటి కోసం నానావస్థలు పడుతున్నారు. దాళ్వా సాగుకు ఎటువంటి ఇబ్బందీ లేకుండా ప్రతి ఎకరాకూ నీరందిస్తామని చెప్పిన మంత్రులు సాగునీటి సమస్యపై నోరు మెదపకపోవడం అందరినీ ఆందోళనకు గురిచేస్తోంది. వంతులవారీ విధానం కూడా సత్ఫలితాలు ఇవ్వకపోవడంతో పొలాలన్నీ ఎండిపోతున్నాయి. దీంతో రైతులు ఆయిల్ ఇంజిన్లు ఏర్పాటు చేసుకుని నీటిని తోడి వరిపైరును రక్షించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటం సమస్యను మరింత జఠిలం చేస్తోంది. ప్రధానంగా సాగునీరు పంపిణీలో అధికార పార్టీ పెద్దల జోక్యం, నీటి మళ్లింపు కారణంగానే సమస్య తీవ్రతకు కారణమని రైతులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రైతులందరికీ అవసరమైన సాగునీరందేలా చర్యలు చేపట్టాలి. లేనిపక్షంలో నీరందక దిగుబడి తగ్గి రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది.

-వియస్‌ఎస్‌వి.ప్రసాద్

సమస్యల పరిష్కారానికి చక్కని వేదిక 'రాత్రిసభ'

మాట్లాడుతున్న ప్రముఖుడు

నూజివీడు రూరల్: ప్రజలకు చేరువగా, గ్రామాల్లోని ప్రజాసమస్యలు పరిష్కారమే 'రాత్రిసభ' కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ అన్నారు. శుక్రవారం మండలంలోని రావిచర్ల గ్రామంలో 'రాత్రిసభ'ను సబ్ కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాత్రిసభలో ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్నాయో.. లేదో.., అధికారులు ప్రజలకు అందించే సేవలను అడిగి తెలుసుకుంటామన్నారు. మండల యంత్రాంగం సాయంత్రం గ్రామాల్లో పర్యటించి ప్రజాసమస్యలపై ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, సామాన్యులతో చర్చిస్తారని, వారంలో ఒకరోజు గ్రామస్థాయి సమస్యలపై సర్పంచి, గ్రామస్తులతో చర్చ, ప్రజా సమస్యలపై సత్వర పరిష్కారానికి అవకాశం ఉంటుందన్నారు.

ఆగిరిపల్లి మండలంలోని చిన్న ఆగిరిపల్లి గ్రామంలోనూ మండలస్థాయి అధికారులు 'రాత్రి సభ' నిర్వహించారు. ముసునూరు, చింతలపూడి లింగపాలెం మండలాల్లో 'రాత్రి సభ' నిర్వహిస్తామని సబ్ కలెక్టర్ తెలిపారు.

నారాయణపురం డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురం శ్రీ అరవింద శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రారంభ సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టికె.విశ్వేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థి దశ ఎంతో విలువైందన్నారు. సమయాన్ని వృథా చేయకుండా కళాశాలలోని వసతులను ఉపయోగించుకుని పోటీ ప్రపంచంలో ఉనికిని చాటుకుని, జీవితంలో ఉన్నతంగా స్థిరపడాలన్నారు. గౌరవ అతిథిగా విచ్చేసిన మహాత్మా గాంధీ జూనియర్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ బివి.శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని పెట్టుకుని ఆ లక్ష్యసాధన కోసం నిరంతరం శ్రమించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అంతర్గత నాణ్యత ప్రమాణాల విభాగం సమన్వయకర్త రవి మాట్లాడుతూ కోపం, భయం ఇలాంటి శత్రువులను దరి చేరనివ్వకుండా నైపుణ్యంతో కూడిన విద్యను అభ్యసించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వైస్ ప్రిన్సిపల్ ఆర్.రెడ్డయ్య మాట్లాడుతూ నిరంతర శ్రమతో అభివృద్ధి తథ్యమన్నారు. డిగ్రీలో చేరిన జూనియర్ విద్యార్థులు కళాశాలలో సౌకర్యాల గురించి అనుభవాలను పంచుకున్నారు.

దళితుల సాగు భూమి పరిశీలన

చాట్రాయి:మండలంలోని జనార్ధనవరం గ్రామంలో దళితులు సాగు చేస్తున్న భూమిని చాట్రాయి తహశీల్దార్ సిహెచ్.విశ్వనాధరావు శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జనార్ధనవరం గ్రామంలో ఆర్ఎస్ నెంబర్ 83,84/2లో సుమారు 17.20 సెంట్ల భూమి రెవెన్యూ రికార్డుల్లో వాగు భూమిగా నమోదైంది. కాని అదే భూమిని 1986 నుంచి సాగు చేస్తున్నామని, ఆ భూముల్లో ఎటువంటి వాగు లేదని, గతంలో పిడబ్ల్యూ శాఖ వారు పట్టాలు ఇచ్చేందుకు నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ ఇచ్చారని, క్లాస్ పికేషన్ మార్పు చేసి పట్టాలు ఇవ్వాలని కోరుతూ దుర్గం వెంకటేశ్వరరావు స్పందనలో అర్జీ అందించారు. ఈ క్రమంలో తహశీల్దార్ ఆ భూమిని పరిశీలించారు. అనంతరం తహశీల్దార్ దళితులతో మాట్లాడుతూ వాగు లేదని, ఈ భూములకు పట్టాలు ఇవ్వొచ్చుని, క్లాస్ పికేషన్ మార్పు చేయటం తన పరిధిలో లేదని, జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని, సాగు చేస్తున్న పేదలకు పట్టాలు ఇవ్వాలని ప్రతిపాదన పంపుతానని హామీ ఇచ్చారు. ఆయనతో పాటు విఆర్ఒ వెంకటరత్నం, విఆర్ఎ పురుషోత్తం, సాగు దారులు మధుసూదనరావు, వెంకటేశ్వరరావు, పుల్లారావు ఉన్నారు.

పడమటి గిరిబాబుకు పలువురి అభినందన

జంగారెడ్డిగూడెం:వైసిపి యూత్ జిల్లా అధ్యక్షులుగా నియమితులైన స్థానిక యువ నాయకులు పడమటి గిరిబాబును పలువురు పట్టణ ప్రముఖులు అభినందించారు. వైసిపి పట్టణ నాయకులు గిరిబాబును శనివారం కలిసి పూల మాలలు, శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా వైసిపి ఉభయ గోదావరి జిల్లాల బూత్ రీజనల్ కో-ఆర్డినేటర్ బివిఆర్.చౌదరి మాట్లాడుతూ ఇప్పటివరకు పట్టణ పరిసరాల్లో వైసిపి రాజకీయాల్లో చురుకుగా పనిచేస్తున్న గిరిబాబుకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తగిన గుర్తింపునిస్తూ వైసిపి జిల్లా యూత్ అధ్యక్ష పదవి కల్పించారని పలువురు కొనియాడారు. రాష్ట్రంలో బిసిలకు ప్రాధాన్యతనిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, పామర్రు పరిశీలకులు మండవల్లి సోంబాబు, మేడవరపు సాగర్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, సంకు సురేష్, ఉగ్గం ప్రసాద్, బత్తిన చిన్నా, చిటికెల అచ్యుతరామయ్య, ఎల్‌విఆర్, రాష్ట్ర యువనాయకులు అనిల్ గౌడ్, పాములపర్తి శ్రీను, రాంబాబు, చిప్పాడా వెంకన్న, దిర్సిపాము రాజేష్, నెత్రు సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ శాఖకు శ్మశానవాటిక పనులు

ప్రజాశక్తి - చాట్రాయి

ఇప్పటివరకు శ్మశానవాటికకు సంబంధించిన స్థల సేకరణ, వాటి అభివృద్ధి పనులు రెవెన్యూ శాఖ నిర్వహించింది. ఇప్పుడు రెవెన్యూ శాఖ నుంచి పంచాయతీరాజ్ శాఖకు అప్పగించారు. ఎస్‌సి ఏరియాలోని శ్మశానవాటికకు స్థల సేకరణ, ఫెన్సింగ్, దాని నిర్మాణ బాధ్యతలను పంచాయతీ వారికి అప్పగించారు. శనివారం చాట్రాయి మండలంలోని చాట్రాయి, ఆరుగొలనపేట, తుమ్మగూడెం, సోమవరం, నరసింహారావుపాలెం గ్రామాల్లో తహశీల్దార్ సిహెచ్.విశ్వనాధరావు, ఎంపిడిఒ ఎన్.మురళీమోహన్, పంచాయతీ కార్యదర్శులు శ్మశానవాటిక స్థలాలను పరిశీలించారు. అనంతరం బాధ్యతలను తహశీల్దార్, ఎంపిడిఒకు అప్పగించారు.

ఆర్అండ్‌బి రోడ్డుకు మరమ్మతులు

ఉంగుటూరు:చేబ్రోలు- దూబచర్ల ఆర్అండ్‌బి రహదారిలో గోపీనాథపట్నం నుంచి నల్లమాడు వరకు అధ్వానంగా తయారైన రోడ్డుకు అధికారులు మరమ్మతు పనులు శనివారం ప్రారంభించారు. మరమ్మతుల కోసం రూ.15 లక్షలు నిధులు మంజూరయ్యాయి. ఆ నిధులతో గోతుల్లో తారు, మెటల్ వేసి చదును చేస్తున్నారు. కాగా పాడైపోయిన రోడ్డును పూర్తిస్థాయిలో నిర్మించాలని, ఇలా అరకొర మరమ్మతులతో ఒరిగేదేమీ లేదని వాహనదారులు, ప్రయాణికులు వాపోతున్నారు.

నేడు గొల్లగూడెంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఉంగుటూరు

మండలంలోని గొల్లగూడెంలో దూబచర్ల లయన్స్ క్లబ్ సౌజన్యంతో ఈనెల 26వ తేదీన ఆదివారం స్థానిక సాయిబాబా ఆలయం వద్ద ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు క్లబ్ సభ్యులు తెలిపారు. పరిసర గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అవసరమైన వారికి కళ్లజోళ్లు ఇస్తామన్నారు. కంటి ఆపరేషన్లు అవసరమైన వారికి ఉచితంగా చేయిస్తామన్నారు.

నేరాలు - ఘోరాలు

చీటీలు కట్టించుకొని మోసం

గణపవరం:చీటీలు కట్టించుకుని పాడుకున్న సొమ్మును ఇవ్వకుండా మోసం చేసిన వ్యక్తిపై గ్రామస్తులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ వి.వెంకటేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గణపవరం గ్రామానికి చెందిన పెరుమాళ్ల ఫణీంద్రకుమార్ 2017 నుండి చీటీ పాట నిర్వహిస్తున్నాడు. 2019 వరకూ చీటీ పాడుకున్నవారికి సక్రమంగా సొమ్ములు చెల్లించాడు. ఆ తర్వాత అతని మీద నమ్మకంతో అధిక సంఖ్యలో ప్రజలు చీటీలు కట్టారు. రూ.లక్ష, రూ.ఐదు లక్షలు, రూ.పది లక్షల ఇలా పెద్దఎత్తున చీటీలు కట్టారు. అనంతరం పాడుకున్నవారికి డబ్బులు ఇవ్వకుండా తాత్సారం చేయడంతో అనుమానం వచ్చి ఇటీవల నిలదీశారు. దీంతో అతను కనిపించకుండా పారిపోయాడు. వెంటనే వారంతా పోలీసులకు ఫిర్యాదు చేశారు. సుమారు రూ.89 లక్షల వరకూ చీటీల సొమ్ముతో అతను ఉడాయించాడని బాధితులు పోలీసులకు తెలిపారు. పోలీసులు అతనికోసం గాలిస్తున్నారు.

గంధం చెట్లు చోరీ

ప్రజాశక్తి - చింతలపూడి

గుర్తు తెలియని దుండగులు విలువైన గంధం చెట్లు నరికి అపహరించుకుపోయారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని భట్టువారిగూడెం గ్రామానికి చెందిన ముత్యాలరావుకు 20 సంవత్సరాల వయస్సు కలిగిన గంధం చెట్లను శుక్రవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు నరికి తీసుకెళ్లిపోయారు. ఇటీవలే తోటను బేరం పెట్టానని, కేజీ రూ.15,000 ఉందని, మొత్తం రూ.పది లక్షలు విలువ ఉంటుందని రైతు ముత్యాలరావు వాపోతున్నాడు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి - భీమడోలు

జాతీయ రహదారిపై పూళ్ల వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురు ఢీకొన్న ఘటనలో ఒక వ్యక్తి మృతిచెందాడు. మరో ముగ్గురు గాయలపాలయ్యారు. శుక్రవారం రాత్రి జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నూజివీడు మండలం పల్లేర్లమూడికి చెందిన యర్రవరపు బుల్లేశ్వరరావు, ఆయన భార్య సీతామహాలక్ష్మి అడవికొలనులోని తమ బంధువుల ఇంటికి వెళ్లారు. తిరిగి వస్తుండగా పెట్రోల్ కోసం కురెళ్లగూడెం పెట్రోల్ బంకుకు వెళ్తున్న క్రమంలో కురెళ్లగూడేనికి చెందిన పాస్టర్ మోషే తన సతీమణితో కలిసి మోటార్ సైకిల్‌పై పూళ్లవైపు వెళుతున్నారు. ఈ రెండు వాహనాలు ఎదురెదురు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో యర్రవరపు బుల్లేశ్వరరావు(52) అక్కడికక్కడే మృతిచెందాడు. గాయపడిన ఆయన సతీమణిని చికిత్సనిమిత్తం భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పాస్టర్ దంపతులకు స్వల్ప గాయాలయ్యాయి.

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి - ఉంగుటూరు

కైకరంలో పేకాట శిబిరంపై పోలీసులు శనివారం దాడి చేశారు. నలుగురు జూదరులను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.11 వేలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె.స్వామి తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

అద్దె భవనాల్లోనే ప్రభుత్వ కార్యాలయాలు

ఇబ్బందుల్లో ప్రజలు

ప్రజాశక్తి - గణపవరం

మండల కేంద్రమైన గణపవరంలో ఏళ్ల తరబడి ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. సొంత భవనాల నిర్మాణంపై ప్రజా ప్రతినిధులు, అధికారులు దృష్టి పెట్టకపోవడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పోస్టాఫీస్, రిజిస్ట్రార్, పిషరిష్ కార్యాలయాలు ఏళ్ల తరబడి అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. భవనం యజమానులు అద్దె పెంచినప్పుడల్లా అధికారులు కార్యాలయాన్ని మార్పు చేయటం వల్ల ప్రజలు పలు ఇబ్బందులు ఎదర్కొంటున్నారు. కార్యాలయం ఎక్కడ ఉందో వెతుక్కోవాల్సిన పరిస్థితి వస్తుంది. కార్యాలయాలు ఊరికి శివారులో ఉన్న భవనాలో ఏర్పాటు చేయటం వల్ల స్థానికులు నడిచి రాలేకపోతున్నారు. ఒకవేళ ఆటోలో వస్తే రూ.50 ఖర్చవుతుంది. ప్రజలకు అందుబాటులో ఉండేలా ప్రభుత్వ కార్యాలయాలను సొంతభవనాల్లో ఏర్పాటు చేయాలని అధికారులను, ప్రజాప్రతినిధులను కోరుతున్నారు.

అద్దె భవనంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

మొక్కజొన్న ఫ్యాక్టరీలో మహిళా కూలీకి తీవ్ర గాయాలు

లారీ ఢీకొనడంతో ప్రమాదం
ఆసుపత్రికి తరలింపు

ప్రజాశక్తి - చింతలపూడి

మొక్కజొన్న ఫ్యాక్టరీలో మహిళా కూలీపై లారీ ఎక్కడంతో ఆమె తీవ్ర గాయాలపాలైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గణిజర్ల గ్రామానికి చెందిన జొన్నలగడ్డ మరియమ్మ ఫాతిమాపురం సమీపంలో ఉన్న కెఎంఆర్ మొక్కజొన్న ఫ్యాక్టరీలో కూలి పనులకు వెళుంది. ఈ క్రమంలో శనివారం కూడా ఆమె యధావిధిగా కూలి పనులకు వెళ్లింది. ఈ క్రమంలో ఆమె నడుచుకుంటూ వెళ్తుండగా రివర్స్‌లో వచ్చిన మొక్కజొన్న లోడు దించిన లారీ ఆమెను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మరియమ్మ తీవ్ర గాయాలపాలైంది. ఫ్యాక్టరీ యాజమాన్యం వారు 108 వాహనానికి సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న 108 వాహనంలో మరియమ్మను చింతలపూడి సాయిస్ఫూర్తి ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ తరలించారు.

వైద్య ఖర్చులు యాజమాన్యమే భరించాలి : సిఐటియు

ఏలూరు : జొన్నలగడ్డ మరియమ్మకు యాజమాన్యమే బాధ్యత తీసుకుని వైద్య చికిత్స అందించాలని చింతలపూడి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌విఎస్.నారాయణ, మండల అధ్యక్షులు నత్తా వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. మొక్కజొన్న ఫ్యాక్టరీలో మహిళలకు కావాల్సిన బాత్రూం సదుపాయాలు లేకపోవడంతో మరియమ్మ బహిర్భూమికి వచ్చిందని, ఈ ప్రమాదం చోటు చేసుకుందని చెప్పారు. ఈ ప్రమాదానికి పూర్తి బాధ్యత ఫ్యాక్టరీ యాజమాన్యం భరించాలని డిమాండ్ చేశారు. ఫ్యాక్టరీలో మహిళలకు కావాల్సిన అన్ని సదుపాయాలు కల్పించాలన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే అంబులెన్స్ సౌకర్యం లేకపోవడంతో ఆలస్యమైందని, వెంటనే ఒక అంబులెన్స్ సౌకర్యం కల్పించాలని ఫ్యాక్టరీ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ప్రమాదం జరిగిన బాధితురాలికి అన్ని విధాలుగా ఫ్యాక్టరీ యాజమాన్యం ఆసుపత్రిలో ఖర్చులు, నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

ప్రజాశక్తి - ఏలూరు

కోట దిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో కెరీర్ గైడెన్స్‌పై విద్యార్థులకు శనివారం అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి కళాశాల అధ్యక్షులు డాక్టర్ గుత్తా గిరిబాబు అధ్యక్షత వహించి మాట్లాడారు. విద్యార్థులు గొప్ప గొప్ప లక్ష్యాలు పెట్టుకుని, వాటిని సాధించడానికి నిరంతరం కృషి చేయాలన్నారు. ముఖ్య అతిథి రిటైర్డ్ డిఎస్‌పి సిహెచ్.సురేంద్రమోహన్‌రావు మాట్లాడుతూ ఐఎస్ సాధించడం ఎలా అనే అంశంపై ప్రసంగించారు. భారతదేశంలో అత్యున్నత సర్వీసులైన ఐఎఎస్, ఐపిఎస్ తదితర వాటిని సాధించడానికి విద్యార్థులు నిరంతరం ప్రణాళికాబద్ధంగా చదవాలని, తొలుత వాటి గురించి అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. కెరీర్‌ని అత్యున్నతంగా తీర్చిదిద్దుకోవడంతో పాటు, సమాజానికి సేవ చేసే అవకాశం ఈ సర్వీస్‌ల ద్వారా కలుగుతుందని పేర్కొన్నారు. తాను ఈ క్యాంపస్‌లోనే ఇంటర్మీడియట్ చదివి అంచెలంచెలుగా ఎదిగిన క్రమాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జెకెసి కో-ఆర్డినేటర్ టివిఎస్.పద్మావతి, వైస్ ప్రిన్సిపల్ కె.అజయ్‌బాబు, వివిధ విభాగాల అధ్యాపకులు వి.వెంకట్రావు, డాక్టర్ ఎం.రాంబాబు, డాక్టర్ ఎం.విజయ్‌కుమార్, ఎం.కృష్ణచైతన్య, ఎస్.పరమేశ, డాక్టర్ పిఆర్.కావ్యశ్రీ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - ముసునూరు

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరంగా ఉంటారని జోనల్ కో-ఆర్డనేటర్ పి.హుసేన్ అన్నారు. మండలంలోని కోర్లగుంట గ్రామంలో మండల వ్యవసాయాశాఖాధికారి సిహెచ్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ, ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బందితో కలిసి శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హుసేన్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలతో ఎంతో మేలు చేకూరుతుందన్నారు. దీనిపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కోర్లగుంట సర్పంచి నక్కనబోయిన సత్యనారాయణ, ఎంపిటిసి సభ్యులు సుందరరావు, శ్రీనివాసరావు, పి.పద్మ, బి.శారా, ఎం.సుందర్‌సింగ్, బి.మణి, కె.మణి, ఐబిఐసిఆర్ పిసి వాలంటీర్లు పాల్గొన్నారు.

ముసునూరులో...

బుట్టాయగూడెం : మండలంలోని నిమ్మలగూడెం గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ సర్పంచి బుచ్చిరాజు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచి బుచ్చిరాజు మాట్లాడుతూ రైతులందరూ ప్రకృతి వ్యవసాయం చేయాలని చెప్పారు. పంటకు ముందు నవధాన్యాలు వేయాలని సూచించారు. నవధాన్యాల వల్ల పంట దిగుబడి పెరిగి రైతుకు పెట్టుబడి ఖర్చు తగ్గుతుందన్నారు. కమ్యూనిటీ ప్రకృతి వ్యవసాయ మండల కార్యదర్శి ఎం.ఎ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం అందరూ బాధ్యతగా స్వీకరించాలని, పర్యవరణాన్ని కాపాడుకుందామని కోరారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వ్యవసాయ సహాయకురాలు, సంక్షేమ సహాయకురాలు, హెల్త్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్, వెటర్నరీ అసిస్టెంట్, వాలంటీర్లు పాల్గొన్నారు.

చింతలపూడి : చింతలపూడి మార్కెట్ యార్డులో శివపురం గ్రామంల్లో నవ ధాన్యాల సాగుపై శనివారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ఉద్యాన శాఖ అధికారి లఘపతి మాట్లాడుతూ గ్రామాల్లో తొలకరి జల్లుకు ముందు నవధాన్యాలు వేయడం వల్ల భూమి సారవంతంగా తయారు అవుతుందన్నారు. అంతేకాకుండా వాన పాముల సంఖ్య, సూక్ష్మజీవుల సంఖ్య పెరుగుతుందని, భూమిలో నీటి నిల్వ శాతం పెరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో శివపురం సర్పంచి హరిణి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యా ప్రోత్సాహకాలు అందజేత

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని తిర్లాపురం జెడ్‌పిహెచ్ పాఠశాల విద్యార్థులను ప్రోత్సహిస్తూ భారతీయ మైత్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెడల్స్ అందించారు. తిరుమలాపురం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకూ విద్యలో ప్రతిభ చూపిన 16 మంది విద్యార్థులకు పి.పోతురాజు వితరణతో విద్యాప్రోత్సాహకాల పంపిణీ కార్యక్రమం శనివారం నిర్వహించారు. పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు ప్రక్కి రోహిణీకుమార్ అధ్యక్షతన పాఠశాల తల్లిదండ్రుల కమిటీ అధ్యక్షులు వెలగల వీర వెంకట సత్యనారాయణ నిర్వహణలో నిర్వహించిన కార్యక్రమంలో దాత పోతురాజు మాట్లాడారు. జిల్లా స్థాయి సైన్స్ ప్రదర్శనలో ఏలూరులో జరిగిన ఆంగ్ల వ్యాసరచన పోటీల్లో పర్యావరణ హిత జీవనం అంశంలో ద్వితీయస్థానం సాధించిన వీరన్నగూడేనికి చెందిన విద్యార్థిని కోర్ల నాగశ్రీదేవిని అభినందించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న గ్రామ సర్పంచి కనుపర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ పోతురాజు చిన్నారులను ప్రోత్సహించే అంశంలో చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. పాఠశాల కమిటీ అధ్యక్షులు వెలగల వీరవెంకటసత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం పోతురాజు తమ పాఠశాలలో ఇస్తున్న విద్యాప్రోత్సాహకాలు చిన్నారుల విద్యాప్రగతికి ఎంతో తోడ్పాటును ఇస్తున్నాయన్నారు. సామాజికవేత్త కెఎల్ఎన్.ధనకుమార్ మాట్లాడుతూ విద్యతో ఉన్నతి అంశంపై ప్రసంగిస్తూ పోతురాజుకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం విద్యార్థులకు మెడల్స్, ప్రశంసాపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో మండల కో ఆప్షన్ ఎంపిటిసి షేక్ లాల్ అహ్మద్, సొసైటీ అధ్యక్షులు రాజులపాటి అన్నవరం, ఉప సర్పంచి మానుకొండ శ్రీలక్ష్మి, మాజీ సర్పంచి కనుపర్తి వేణుమాధవ్, వేముల చంటి, కొల్లా ఉమా చంద్రం, మాదాసు చినలక్ష్మయ్య, పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు రోహిణీకుమార్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యాప్రోత్సాహకాలు అందుకున్న విద్యార్థులు

జగనన్న ఇళ్లు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - టి.నరసాపురం

జగనన్న గృహ నిర్మాణ లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్లు పూర్తిచేయాలని ఎంపిడిఒ ఎన్‌టి.స్వామి సూచించారు. మండలంలోని బొర్రంపాలెంలో శనివారం ఇళ్లస్థలాల లబ్ధిదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీలో అన్ని రకాల మౌలిక వసతులను ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. లబ్ధిదారులు లే అవుట్‌లలో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ జెవి.సుబ్బారావు, హౌసింగ్ ఎఇ జి.రాధాకృష్ణ పాల్గొన్నారు.

చింతలపూడి:జగనన్న ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని ఎంపిపి రాంబాబు అన్నారు. మండలంలోని రెచర్లలో జగనన్న లే అవుట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులతో మాట్లాడి త్వరగా ఇళ్ల నిర్మాణం చేసుకోవాలని సూచించారు.

జీలుగుమిల్లి:ఇంటి స్థలం పొందిన వారు త్వరితగతిన గృహాన్ని నిర్మించుకోవాలని హౌసింగ్ పీడీ వేణుగోపాల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన శనివారం దర్భగూడెం పంచాయతీలో నిర్మిస్తున్న గృహాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఇఇ నరసింహారావు, ఎఇ ప్రసాద్, వర్క్ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సువర్ణ, సురేష్, జగన్‌రెడ్డి పాల్గొన్నారు.

టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధిగా శ్యామ్‌చంద్రశేషు

జంగారెడ్డిగూడెం:టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధిగా స్థానిక యువనాయకుడు డాక్టర్ దాసరి శ్యామ్ చంద్ర శేషు నియామకంపై పలువురు టిడిపి నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శనివారం శ్యామ్ చంద్ర శేషుకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శ్యామ్ చంద్ర శేషు మాట్లాడుతూ టిడిపి రాష్ట్ర కార్యదర్శిగా కొనసాగుతున్న తనకు రాష్ట్ర అధికార ప్రతినిధిగా అవకాశం కల్పించిన పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. యువనేత, యువగళం జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కి, పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడుకు, ప్రోగ్రామ్స్ కమిటీ వారికి, పొలిట్ బ్యూరో సభ్యులు పితాని సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో ఇచ్చిన ఈ అవకాశాన్ని ఒక పదవిగా కాకుండా బాధ్యతగా భావించి తన శక్తి మేరకు పని చేసి టిడిపిని అధికారంలోకి తీసుకురావడమే ధ్యేయంగా పని చేస్తానని తెలిపారు. పార్టీ నేతలను సమన్వయ పరుస్తూ ముందుకూ సాగుతామని తెలిపారు.

మహిళా సంక్షేమానికి వైసిపి ప్రాధాన్యత

మండవల్లి:మహిళా సంక్షేమానికి, వారి భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని కైకలూరు ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు స్పష్టం చేశారు. స్థానిక మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో రక్షణ సైన్యం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన గృహ సమితి మహిళా సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. మహిళలకు సిఎం జగన్ ఎన్నోసంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో లెఫ్టినెంట్ కల్నల్ కెజియా స్టాలిన్, అన్నామణి, మెర్సీ మంజుల, మేజర్ అమృతవాణి, డిసి మేజర్ మణి, సర్పంచి మెండ ఝాన్సీ, పిఎసిఎస్ అధ్యక్షులు బొమ్మనబోయిన గోకర్ణ యాదవ్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు బేతపూడి ఏసేవ రాజు, బొంగరాణి, మెండ సురేష్, మేజర్ పి.విజయ్‌కుమార్, మేజర్ కె.సత్యవేదం పాల్గొన్నారు.

పురుగు మందుల ప్రదర్శన నిలుపుదల

భీమడోలు:వ్యవసాయశాఖ ముందస్తు అనుమతులు లేకుండా ఓ కంపెనీ ఏర్పాటు చేసిన పురుగు మందుల ప్రదర్శనను వ్యవసాయ అధికారులు అడ్డుకున్నారు. శుక్రవారం రాత్రి ఆదామా కంపెనీకి చెందిన ప్రతినిధులు భీమడోలులోని మూడుగుళ్ల సెంటర్లలో పురుగుమందుల ప్రదర్శనను ఏర్పాటు చేసి రైతులను ఆహ్వానించారు. దీనిపై అందిన ఫిర్యాదు మేరకు వ్యవసాయ శాఖ భీమడోలు సహాయ సంచాలకులు పి.ఉషా రాజకుమారి ఆధ్వర్యంలో భీమడోలు, ఉంగుటూరు వ్యవసాయాధికారులు ఉషారాణి, వెంకటేష్ దాడులు నిర్వహించారు. ప్రదర్శనకు ఉంచిన సుమారు 1.51 లక్షల విలువ గల పురుగు మందులను స్వాధీనం చేసుకున్నారు.

రైతులు సాంకేతిక నైపుణ్యం సాధించాలి

ప్రజాశక్తి - భీమడోలు

రైతులకు సాంకేతికపరంగా వివిధ అంశాలను బోధించడం ద్వారా చైతన్యవంతులుగా మార్చవచ్చని పోలసానిపల్లి గ్రామ సర్పంచి షేక్ రహీమా బేగం హసేన తెలిపారు. ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, రాజమండ్రి వ్యవసాయ కళాశాలకు చెందిన విద్యార్థులు వ్యవసాయ అనుభవంలో భాగంగా పోలసానిపల్లిని ఎంచుకుని నెలరోజుల పాటు రైతులతో మమేకమై శిక్షణ పొందేందుకు వచ్చారు. దీనిలో భాగంగా గ్రామప్రజలు, వివిధ పంటలు సాగు చేసే రైతులతో మాట్లాడారు. వారి ఇబ్బందులను గుర్తించారు. ఇదేవిధంగా వ్యవసాయశాఖ ద్వారా తమ అనుభవాలను రైతులకు వివరించారు. ఇదే క్రమంలో వ్యవసాయ కళాశాల విద్యార్థులు క్షేత్రస్థాయిలో పొందిన అనుభవాన్ని పరిశీలించేందుకు ఏలూరు ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ ఫణికుమార్, డాక్టర్ నాగేంద్రబాబు శనివారం పోలసానిపల్లి వచ్చారు. రైతులు సాగులో ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపారు. ఇదేక్రమంలో గ్రామాన్ని దత్తత తీసుకున్న వెంకట్రామన్నగూడెం వ్యవసాయ కళాశాల ప్రతినిధులు అక్కడికి చేరుకున్నారు. వారు కూడా రైతులతో మాట్లాడారు. ఇదే నేపథ్యంలో వ్యవసాయ కళాశాల విద్యార్థులు గ్రామపటాన్ని తయారు చేశారు. దీనిలో వ్యవసాయదారులకు అందుబాటులో ఉన్న వనరులు, వారికి కావాల్సిన ఇతర అంశాలను పొందుపర్చారు. గ్రామపటాన్ని ప్రజాప్రతినిధులతో పాటు వ్యవసాయాధికారులు పరిశీలించారు. తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి ఎ.దేవీనాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

పాస్‌పోర్ట్ పోయినది

పశ్చిమ గోదావరి జిల్లా, మొగల్తూరు మండలం, కేపీపాలెం నార్త్ పంచాయతీ పరిధి తంగేళ్ళగూడెంకు చెందిన తంగేళ్ళ యాదగిరి రాజు, తండ్రి: సత్యనారాయణ అను నేను మా ఇంటి వద్ద నుండి పాస్‌పోర్ట్ తీసుకుని నా వ్యక్తిగత పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంపై మొగల్తూరు వెళుతుండగా మార్గమధ్యంలో పాస్‌పోర్ట్ నెంబర్ **M3434989 అను నెంబర్ గల నా పాస్ పోర్ట్ పడిపోయినది.** ఎవరికైనా దొరికిన యడల ఈ క్రింది చిరునామాకు తెలియజేయగలరు.

తంగెళ్ల యాదగిరి రాజు
తండ్రి: సత్యనారాయణ, కేపీపాలెం నార్త్,
తంగెళ్లగూడెం, మొగల్తూరు మండలం.
సెల్: 95023 94285

ప్రకటన

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఒ.యస్.నెం. 16/2020

బిట్వీన్:
ది.గోపినాధపట్నం ఇవాంజలికల్ చర్చ్ ఫండేషన్ రిప్రజెంటెడ్ బై ఆర్గనైజర్స్ ...వాది

మరియు

ది.మోస్ట్ రివరెండ్ కె.పి.యోహనన్ వగైరాలు ...ప్రతివాదులు

పై నెంబరు గ్రంధములో మొదటి ప్రతివాది అయిన కె.పి. యోహనన్ గారు, తండ్రి: చోకోపినోస్ బిషప్ వేస్ నెం.1 వరిక్కాడు తిరువళ్ళ టౌన్ కేరళ అను వారు దావా సమనులు, నోటీసులు తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు **ది.17-03-2023వ తేదీ పగలు గం॥10:00 ని॥లకు శ్రీ కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, అడ్వకేట గారి ద్వారా గాని హాజరు కానిచో వారి పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలముగా వారికి తెలియజేయడమైనది.**

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

కాజ నాగేశ్వరరావు
తాడేపల్లిగూడెం, అడ్వకేట్, తాడేపల్లిగూడెం.
25-2-23. సెల్: 99895 38628

మహారాజశ్రీ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో :: తాడేపల్లిగూడెం
ఐ.ఎ.నెం. 197/2022
ఇన్ ఒ.యస్.నెం. 275/2022

బిట్వీన్:
వరుకూటి వెంకట రామారావు ...పిటీషనరు /వాది

మరియు

దేవ బాలకృష్ణ ...రెస్పాండెంటు /ప్రతివాది

పై నెంబరు పిటీషనులో శ్రీ కోర్టు వారు రెస్పాండెంటు /ప్రతివాది అయిన దేవ బాలకృష్ణ, తండ్రి: పోలారావు, వ్యాపారం, డో.నెం. 2-36, R/o. జగన్నాధపురం, తాడేపల్లిగూడెం మండలం, పశ్చిమ గోదావరి జిల్లా అయిన వారు నోటీసులు తీసుకోకుండా కాలయాపన చేయుచున్నందున వారికి Substituted Service ద్వారా నోటీసు అమలు చేయుటకు ఉత్తర్వులు ఇచ్చినారు. కావున రెస్పాండెంటు /ప్రతివాది **ది.27-03-2023న ఉదయం గం॥10:30 ని॥లకు ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా గాని హాజరై వారి అభ్యంతరములు తెలియజేయగలరు.** లేని ఎడల వారి పరోక్షమున శ్రీకోర్టు వారు తీర్పు గావింతురు అని తెలియజేయడమైనది.

జి.కె.దుర్గా దేవి
తాడేపల్లిగూడెం, అడ్వకేట్, తాడేపల్లిగూడెం.
25-2-23. సెల్: 99855 92776

ప్రకటన

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. No. 268/2015

Between:
గద్దే చంద్రశేఖర్ -వాది
Vs
గద్దే మంగరాజు వగైరా -ప్రతివాదులు

పై నెంబరు దావాలో ఆరవ ప్రతివాది శ్రీమతి నందిన చంద్రావతి, భర్త లేటు నందిన సత్యనారాయణ, డోర్ నెం. 5-125, ముప్పనవారిగూడెం, బుట్టాయగూడెం మండలం మరియు ఏడవ ప్రతివాది శ్రీమతి ఈడుపుగంటి వీర వెంకట లక్ష్మి, భర్త: ప్రసాదరావు, డోర్ నెం. 7-187, కానూరు, ఉండ్రాజవరం మండలం అనువారు పై నెంబరు దావాలో కోర్టు ద్వారా ఎన్నిమార్లు సమన్లు పంపినప్పటికి తీసుకొనకుండా Evade చేయుచున్నందున శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు మేరకు యీ ప్రకటన ఇవ్వడమైనది. కావున సదరు ఆరవ ప్రతివాది శ్రీమతి నందిన చంద్రావతి, ముప్పనవారిగూడెం, బుట్టాయగూడెం మండలం మరియు ఏడవ ప్రతివాది శ్రీమతి ఈడుపుగంటి వీర వెంకట లక్ష్మి, కానూరు, ఉండ్రాజవరం మండలం అనువారు **ది. 20-03-2023వ తేదీన ఉదయం గం॥ 10.30 నిమిషములకు** పైన తెలిపిన కోర్టులో స్వయంగా గాని, అడ్వకేట్ ద్వారా గాని హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పరోక్షమున తీర్మానించబడునని తెలియపరచడమైనది.

తాడేపల్లిగూడెం **ధూళిపాళ సూర్య రామారావు**
తేది.20-02-2023 వాది తరపు న్యాయవాది

ప్రకటన

బ్యాంక్ ఆఫ్ ఇండియా, గన్నవరం బ్రాంచి, కృష్ణాజిల్లా వారి సూచనలు మేరకు ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయటమేమనగా దావాజీగూడెం బుద్ధవరం గ్రామ శివారు, గన్నవరం మండల వాస్తవ్యుడు గోపిదేశి మంజుల, భర్త : మాధవ గారు దిగువ షెడ్యూలు దాఖలా ఆస్థిని విజయవాడకు చెందిన దొప్పలపూడి ప్రవీణ్‌కుమార్, తండ్రి : విష్ణువర్ధనరావు గారి వద్ద దిగువ షెడ్యూలు ఆస్తిని ది.19-1-2023న క్రయం చేసి విక్రయ ఖరారు పొందినారు. షెడ్యూలు ఆస్థి 1. బొచ్చ అప్పారావు, 2. సాంబశివరావు, 3. శ్రీనివాసరావు, 4. శేఖర్ కుమార్, 5. అశోక్ రామకుమార్ గారలు ది. 14-3-1982న విక్రయ దస్తావేజు నెం. 1505/1982గా 1వ పుస్తకం. 1340 వాల్యూమ్, 144 నుండి 147 పేజీలలో స.రి. ఆఫీసు ఏలూరులో రిజిష్టరు కాబడిన దస్తావేజు వాల్యూ క్రయం చేసి అనుభవిస్తున్నంతలో బొచ్చ శ్రీనివాసరావు గారు 11-12-2001న ఇంటెస్టేట్‌గా తన భార్యయైన బొచ్చ సుజాత, కుమారుడు సింహాచలం, కుమార్తె సాయి సౌజన్యలను హిందూ వారసత్వ చట్టం సె.8 ప్రకారం వారసులుగా వదిలి పరమపదించినారు. వారి మరణానంతరం పై క్రయదారులు మరియు బొచ్చ శ్రీనివాసరావుగారి వారసులు ఆర్.ఎస్.నెం. 109/3లో 2.35 సెంట్లు భూమిని ది. 16-07-2014న ఏలూరు స.రి. ఆఫీసులో రిజిష్టరు కాబడిన విక్రయ దస్తావేజు నెం. 6109/2014గా దొప్పలపూడి ప్రవీణ్‌కుమార్ గారికి విక్రయించి స్వాధీన పరచగా వారు డి.టి.సి.పి. ఏలూరు వారిచే సి.నెం : 368/2016/E T.L.P. No. 32/2016/E గా లే అవుట్ పొంది ఆస్థిని భూ వినియోగ మార్పిడి చేసుకొని ను ప్లాట్లుగా విభజించి ప్లాటు నెం. 24లో షెడూయలు ఆస్తి గోపిదేశి మంజుల గారికి విక్రయించినారు. కావున ఎవరికైననూ బొచ్చ శ్రీనివాసరావు గారి మరణానికి సంబంధించి, వారి వారసుల ఆస్థి సంక్రమణ సంబంధించి చెల్లదగు, చట్టపరమైన ఎటువంటి ఆక్షేపణ అభ్యంతరములున్ననూ వాటిని రిజిష్టరు పోస్టు తిరుగు రశీదుతో దిగువ చిరునామాకు 7 రోజులలో తెలుపుకోవలయును. గడువు దాటి వచ్చిన అభ్యంతరములు పై బ్యాంకు వారు పొందబోయే తనఖా హక్కులు భంగపరచజాలవు.

షెడ్యూల్ : ఏలూరు జిల్లా, వట్లూరు స.రి. యిలాకా, పెదపాడు మండలం, వసంతవాడ గ్రామపంచాయతీ ఆర్.ఎస్. నెం. 109/3 దాఖలా ప్లాట్ నెం. 24లో 137.872 చ.గ.
తూర్పు : ప్లాట్ నెం. 24 తూర్పు భాగం
దక్షిణం : ప్లాట్ నెం. 25
పడమరం : 33 అడుగుల రోడ్డు
ఉత్తరం : 33 అడుగుల రోడ్డు

పి.ఉమాశంకర్,
న్యాయవాది
డోర్ నెం.23-23-18, శివరావు వీధి,
సత్యనారాయణపురం, విజయవాడ-11
సెల్ : 9490838982